క్లుప్తంగా

ఘనంగా పవమాన హోమం



పవమాన హోమం నిర్వహిస్తున్న దృశ్యం

బోట్‌క్లబ్: అధిక శ్రావణ మాసం సందర్భంగా స్థానిక గొడారిగుంట జర్నలిస్టుకాలనీలో ఉన్న సత్యదేవ మందిరంలో ఆదివారం పవమాన హోమం ఘనంగా నిర్వహించారు. మధ్వ పురోహితులు యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. రమా సహిత సత్యదేవ, దాసాంజనేయస్వామి వార్లకు అభిషేకాలు, పుష్పాలంకరణ చేశారు. ఈ సందర్భంగా మధ్వేష్ మాట్లాడుతూ అధిక మాసం సందర్భంగా చేసే ప్రతీ కార్యక్రమం వల్ల విశేష ఫలితాలు పొందవచ్చునన్నారు. హనుమంతుడు, నవగ్రహాలతోపాటు పలు హోమాలు చేశామన్నారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధ్వ గృహస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ప్రసార దినోత్సవం

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జాతీయ ప్రసార దినోత్సం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రజల జీవితాలలో మిళితమైన ప్రసార సాధనాలు బహుజన హితాయ, బహుజన సుఖాయ అనే నినాదంతో వచ్చాయని రేడియో, దూరదర్శన్‌లు ప్రజల జీవితాలలో ఒక ముఖ్యమైన భాగంగా నిలిచాయన్నారు. 1927జూలై 23న దేశంలో తొలిసారిగా బొంబాయి స్టేషన్ నుంచి రేడియో ప్రసారాలు ప్రారంభమవ్వడంతో అప్పటి నుంచి జాతీయ ప్రసార దినోత్సవాన్ని జరుపుకొంటున్నామన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రాఘవరావు, రెడ్నం రాజా, పాల్గొన్నారు.

డాక్టర్ బీఎస్ రావుకు నివాళి



డాక్టర్ బీఎస్ రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి

బాలాజీచెరువు: శ్రీ చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ బొప్పన సత్యనారాయణరావు(బీఎస్ రావు)కు నగర ప్రముఖులతో పాటు పలువురు విద్యావేత్తలు ఆదివారం నివాళులర్పించారు. లక్ష్మీనారాయణ శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రాంగణంలో ఆదివారం సంతాప సభ నిర్వహించగా కాకినాడ నగర శాసన సభ్యులు ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి దీపక్‌రెడ్డి, ఏజీఎం హరిరామప్రసాద్, ఆర్‌వి గోపినాథ్, ప్రైవేట్ స్కూల్స్ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి సానా ట్రస్ట్ చేయూత



వృద్ధాశ్రమానికి ఫ్రిజ్ అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ హరీష్

బాలాజీచెరువు: జగన్నాథపురం జనావళి వృద్ధాశ్రమానికి తన సేవలు నిరంతరం ఉంటాయని, ఏ రంగానికి సేవ చేసినా ఇటువంటి సేవలకు సాటి రావని హరీష్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్ పేర్కొన్నారు. సాన సతీష్ బాబు ఫౌండేషన్ అందజేసిన ఫ్రిజ్‌ను పండ్లు, బకెట్లను ఆదివారం అందజేశారు. ఫౌండేషన్ సభ్యుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

మణిపూర్‌లో హింసకు వ్యతిరేకంగా ర్యాలీ



సర్పవరం జంక్షన్ వద్ద రేస్ ఆఫ్ పీస్ వర్షిప్ సభ్యుల ర్యాలీ

కాకినాడ రూరల్: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడులు, హింసకు వ్యతిరేకంగా రమణయ్యపేటలోని రేస్ ఆఫ్ పీస్ వర్షిప్ సభ్యులు ఆదివారం ఏపీఎస్పీ వద్ద చర్చి నుంచి సర్పవరం జంక్షన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టరు మూర్తిరాజు మాట్లాడుతూ మణిపూర్ సంఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. మహిళపై అఘాయిత్యాలుకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జంగా గగారిన్, విల్సన్, అబ్రహం రెడ్డి, మధుసూదన్ రావు, వినోద్, మహిళలు పాల్గొన్నారు.

ప్రివిలేజ్ క్లినిక్

- గ్రామీణులకు ప్రత్యేక నదుపాయం
- ఏ అనారోగ్య సమస్య వచ్చినా వైద్యం
- నెలకు రెండుసార్లు పలకరించే ఫ్యామిలీ డాక్టర్



కాకినాడ రూరల్: ఇంటికి వచ్చి నాడి పట్టి రోగం తగ్గించే వైద్య విధానం జగనన్న ప్రభుత్వంలోనే సాధ్యమవుతోంది. ఆర్‌ఎంపీలు, నాటు వైద్యులను ఆశ్రయించే రోజులు మారాయి. దూరంలో ఉన్న పట్టణాలకు వెళ్లే పరిస్థితి లేనపుడు వైద్యుడే దేవుడిలా పల్లెలకు వచ్చి ప్రాణాలు నిలుపుతున్న పరిస్థితి నేడు నెలకొంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాలతో ప్రజలను ఆదుకుంటున్న సీఎం జగన్ ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తూ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు అందుబాటులోకి తీసుకువచ్చారు.

కాకినాడ రూరల్ మండలం

పీహెచ్‌సీలు – పండూరు, తూరంగి

వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు	39
వైద్యులు	4
ఎంఎల్‌హెచ్‌పీలు (మిడ్ లెవిల్ హెల్త్ ప్రొవైడర్లు)	39
ఏఎన్‌ఎంలు	42
ఆశా వర్కర్లు	78
ఫ్యామిలీ డాక్టరు ఓపీ సేవలు (9నెలలకు)	52,650

కరప మండలం

పీహెచ్‌సీలు – కరప, వేళంగి

వైద్యులు	4
వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు	22
ఎంఎల్‌హెచ్‌పీలు	22
ఏఎన్‌ఎంలు	22
ఆశా వర్కర్లు	44
సేవలు	31,680

వీటి ద్వారా ప్రతి రోజు సచివాలయ పరిధిలోని ప్రజలకు ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు వైద్య సేవలందిస్తున్నారు. గత ఏడాది అక్టోబరు నుంచి ఈ విధానం అమలులోకి రావడంతో వైద్యులు నెలకు రెండు సార్లు ఆయా క్లినిక్‌లను సందర్శించి ఓపీ చూసి, అవసరమైన చోట్ల ఇళ్లకు వెళ్లి రోగులు, గర్భిణులు, బాలింతలను వైద్యం చేస్తున్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో నాలుగు పీహెచ్‌సీలు ఉండగా 61 వైఎస్సార్ క్లినిక్‌లు అందుబాటులో ఉన్నాయి. కొన్నింటికి సొంత భవనాలు అందుబాటులోకి రాగా మరికొన్నింటిని సచివాలయాల్లో కొనసాగిస్తున్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ద్వారా 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు 105 రకాల మందులను అందజేస్తున్నారు. వైఎస్సార్ క్లినిక్‌లలో నిత్యం సగటున 40 మందికి వైద్యంతో పాటు 20 మందికి సుగర్, బీపీ, రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు.



కాకినాడ రూరల్ వలసపాకల గ్రామంలో సేవలందిస్తున్న పండూరు పీహెచ్‌సీ వైద్యురాలు కె.మాధవి



సర్పవరంలో ఆధునికంగా నిర్మించిన వైఎస్సార్ క్లినిక్ భవనం



కరప మండలం సిరిపురంలో ఇంటికి వెళ్లి బాలింత, పసిబిడ్డను పరీక్షిస్తున్న వైద్యురాలు సింధూర

సుగర్, బీపీలకు మంచి వైద్యం అందుతోంది



మా దంపతులు ఇద్దరం వృద్ధులమయ్యాం. భార్య చర్మ సంబంధిత సమస్యతో బాధ పడుతోంది. నాకు బీపీ, సుగర్ ఉంది. నెల నెలా వైద్య పరీక్షలకు బెంగగా ఉండేది. వైఎస్సార్ క్లినిక్‌లు అందుబాటులోకి వచ్చిన తరువాత ఆ బెంగ తీరింది. బీపీ, సుగర్‌లకు మందులు ఇస్తున్నారు. నెలకు రెండు సార్లు ఫ్యామిలీ డాక్టర్ ద్వారా వైద్యం చేస్తున్నారు. విద్య, వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా పొందుతున్నారు. భార్యకు వైద్యం అందుతోంది. ప్రభుత్వం వచ్చిన తరువాత మాలాంటి వారికి వైద్య సేవలు బాగున్నాయి.

– దంతులూరి జగన్నాథరావు, వలసపాకల

సుస్తీ చేస్తే మంచి మందులు ఇస్తున్నారు



మాది పేద కుటుంబం. నీరసంగా ఉంటే ఆస్పత్రికి పోలేని పరిస్థితి. జ్వరం వచ్చినా, జలుబు వచ్చినా ఇప్పుడు బెంగ లేదు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లకు వెళ్లి పరీక్షలు చేయించుకుంటున్నాం. మాత్రలు ఇస్తున్నారు. ఆరోగ్యం కాపాడుకునేలా వైద్యం అందుబాటులోకి తెచ్చిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

– వాసంశెట్టి కామేశ్వరి, కాకినాడ రూరల్

ఏర్పాట్లపై చర్చ

కాకినాడ సిటీ: ఆగస్టు 21, 22 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర ఏపీఎన్‌జీవో అసోసియేషన్ 21వ కౌన్సిల్ సమావేశాల్లో అజెండా, ఏర్పాట్లపై కాకినాడ జిల్లా ఏపీఎన్‌జీవో అసోసియేషన్ కార్యవర్గం అత్యవసర సమావేశమై చర్చించారు. ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శాఖ అత్యవసర సమావేశాన్ని కాకినాడ ఎన్‌జీవో హోంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుద్దటి రామమోహనరావు, పేపకాయల కృష్ణల అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసు, జిల్లా కార్యవర్గం, జిల్లాలోని 21 తాలూకా యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, ఉమెన్ వింగ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సమావేశంలో పాల్గొని అజెండా, ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: రావుల ఫౌండేషన్ కాకినాడ ఆధ్వర్యంలో వెండి, బంగారం వర్తక సంఘ కల్యాణ మంటపంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు ఆరటికట్ల రామ్మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి లయన్స్‌క్లబ్ కాకినాడ సహకారం అందించగా దాదాపుగా మంది కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి కణితి ప్రసాద్, కోశాధికారి కె.సత్తిబాబు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ కల్చరల్: యువత అన్నిరంగాల్లో రాణించాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ముజిగల్ సంగీత అకాడమీ 7వ బ్రాంచ్‌ను ద్వారంపూడి జ్యోతి వెలిగించి ఆదివారం ప్రారంభించారు. అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన సంగీత అకాడమీని కాకినాడ వాసులు సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. సంగీత విద్యను అందరికి చేరువ చేయాలనే ఉన్నత ఆశయంతో అకాడమీ ఏర్పాటు చేశామని ముజిగల్ సంగీత అకాడమీ ఫౌండర్ డాక్టర్ ఏలూరి లక్ష్మీనారాయణ చెప్పారు. నిష్ణాతులయిన అధ్యాపకులతో ఉన్నత ప్రమాణాలతో కూడిన సంగీత విద్యను అకాడమీ అందజేస్తుందన్నారు. భారతీయ, ప్రాశ్చాత్య సంగీతంలో విస్తృత స్థాయి కోర్సులు అందజేస్తున్నామన్నారు. గాయకులు కొండేపూడి యశస్వి, మహేష్, వాకట్టు కిషోర్, డాక్టర్ ఎస్‌వీఎస్ రావు పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడేలా ప్రాజెక్టులు



జ్యోతి వెలిగిస్తున్న విజయకుమార్‌రాజు. చిత్రంలో ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, బాదం బాలకృష్ణ

బాలాజీచెరువు: లయన్స్ క్లబ్ ద్వారా సమాజానికి ఉపయోగపడే శాశ్వత ప్రాజెక్టులు స్థాపించాలని లయన్స్ ఇంటర్నేషనల్ బోర్డు సభ్యులు వి.విజయకుమార్ రాజు పేర్కొన్నారు. స్థానిక సూర్యకళా మందిరంలో ఆదివారం 2023–24 లయన్స్ జిల్లా క్యాబినెట్ ప్రమాణ స్వీకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రాజు మాట్లాడుతూ క్లబ్ ద్వారా ఆరోగ్య రంగానికి సంబంధించి సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మరో ముఖ్య అతిథి ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ సామాజిక సేవలో లయన్స్‌క్లబ్ సేవలు అద్భుతమని, ప్రజలకు ఉపయోగపడే వాటిని చేయడం ద్వారా లయన్స్ సభ్యులకు మరింత గౌరవం దక్కుతుందన్నారు. అనంతరం క్లబ్ సభ్యులతో ప్రమాణ స్వీకరణ చేయించారు. జిల్లాలో ఉన్న 600 మంది సభ్యులు హాజరయ్యారు. కాన్ఫరెన్స్ గౌరవ చైర్మన్ లయన్ డాక్టర్ బాదం బాలకృష్ణ, మంజులూరి విశ్వేశ్వరరావు, డీవీఎస్ రాజు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్యాయత్నం

కరప: గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఒక యువకుడు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానికులు, కరప పోలీసులు తెలిపిన వివరాల మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా పి.గన్నవరం గ్రామానికి చెందిన తెమ్మాడి లక్ష్మి, ఇద్దరు కుమారులతో కల్సి కరప మండలం వేములవాడ సమీపంలోని చేపల చెరువుల వద్ద పనిచేస్తున్నారు. శనివారం రాత్రి లక్ష్మి పెద్దకుమారుడు నాగరాజు(22) చెరువుల వద్దనే గడ్డి మందు తాగి, స్పృహతప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నాగరాజు కోమాలోనే ఉన్నాడని, పరిస్థితి విషమంగా ఉందంటున్నారు. కరప ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మణిపూర్ దాడులపై ర్యాలీ రేపు

కాకినాడ సిటీ: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై, అక్కడ ప్రజలపైన జరుగుతున్న దాడులను నిరసిస్తూ మంగళవారం జిల్లా పాస్టర్ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు పాస్టర్ల ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ తెలిపారు. కాకినాడ భానుగుడి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని ఆదివారం కాకినాడలో విలేకర్లకు తెలిపారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున వివిధ సంఘాల ప్రతినిధులు, నాయకులు ప్రజలు పాల్గొంటారన్నారు.

సేవలతో పేదలకు అండ

వలంటీర్లకు వందనం



వేములవాడలో లబ్ధిదారుని ఇంటికెళ్లి పట్టా ఇస్తున్న వలంటీర్ హరికృష్ణ

కరప: వేములవాడ వలంటీర్ టేకుమూడి హరికృష్ణ తనకు కేటాయించిన 50 కుటుంబాలవారికి సేవలందిస్తూ, అండగా నిలుస్తున్నారు. ఆయా కుటుంబాలను తరచుగా కలుస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, అర్హులైనవారితో దరఖాస్తు చేయించి, మంజూరు చేయిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. తన పరిధిలో కురుపూడి మంగయ్యమ్మ కుటుంబానికి పింఛన్ రాయించి, ప్రతీనెల ఉదయానే ఠంచన్‌గా పింఛన్ అందజేస్తున్నారు. ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా, చేయూత పథకాలు వచ్చేలా చేశారు. హరికష్ణ చేస్తున్న సేవలకు ఆయా కుటుంబాల వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రైతు భరోసా వచ్చేలా చేశారు



కొద్దిపాటి భూమితో వ్యవసాయం చేస్తున్న మా కుటుంబానికి రైతు భరోసా వచ్చేలా చేశారు. వర్షాలకు పంటపొలాలు మునిగిపోయి దెబ్బతింటే పంటల బీమా వచ్చేలా చేశారు. మరొకసారి పాక్షికంగా దెబ్బతింటే ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయించారు. పింఛన్ రాయించి, ఒకతో తేదీనే పొద్దుటే వచ్చి, పింఛన్ సొమ్ము చేతిలో పెడుతున్నారు. దరఖాస్తు చేయించి రూ.6 లక్షలు విలువచేసే ఇంటి స్థలం మంజూరు చేయించారు. సంక్షేమ పథకాల ద్వారా ఇంతవరకూ రూ.1,56,195 వచ్చేలా చేసిన వలంటీర్ మా కుటుంబానికి ఆర్థికంగా భరోసా కల్పించారు.

– కురుపూడి మంగయ్యమ్మ, వేములవాడ

సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు



సీఐకు జ్ఞాపిక అందిస్తున్న క్లబ్ సభ్యుడు రవిరెడ్డి

బోట్‌క్లబ్: ప్రస్తుతం జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తే నియంత్రణకు వీలు కలుగుతుందని టూటౌన్ సీఐ నాయక్ అన్నారు. స్థానిక 7వ వార్డు బర్మాకాలనీలో వారధి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇటీవల కాలంలో నేరాల సంఖ్య పెరగడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సురక్షితమైన సమాజాన్ని నిర్మించడానికి ప్రజలతో పోలీస్ యంత్రాంగం అనే అంశంపై పలు సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. కాలనీవాసులు ఊరికి వెళుతున్న సమయంలో ముందుగా స్టేషన్‌లో సమాచారాన్ని అందిస్తే సీసీ కెమెరాలతోపాటు ఇతర భద్రతా అంశాలను చేపట్టడానికి వీలుంటుందన్నారు. దీనివల్ల నేర నియంత్రణతోపాటు కొత్త వ్యక్తులను గుర్తించడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం సీఐను రోటరీ గోల్డెన్‌జూబ్లీ క్లబ్ సభ్యుడు సత్తి రవిరెడ్డి జ్ఞాపికతో సత్కరించారు.

మోదీ ప్రభుత్వాన్ని ఓడించడానికి విస్తృత వేదికలు



సీపీఎం జిల్లా శాఖ కార్యదర్శుల శిక్షణ తరగతుల్లో పాల్గొన్న నాయకులు

కాకినాడ సిటీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలతో దేశ వనరులను దోచి పెడుతోందని, ఈ విధానాలు వ్యతిరేకించే పార్టీలు, సంస్థలపై కేంద్ర సంస్థలను ప్రయోగించి కేసులు పెడుతోందని సీపీఎం నాయకులు విమర్శించారు. రెండు రోజులుగా కాకినాడ సుందరయ్యభవన్‌లో నిర్వహించిన సీపీఎం జిల్లా కార్యదర్శుల శిక్షణ ముగింపు సమావేశంలో వారు మాట్లాడారు. రెండు పార్టీల వ్యవస్థలను తీసుకొచ్చి ప్రాంతీయ పార్టీలను అణగదొక్కే బీజేపీ కుట్రలు రాష్ట్రంలోని పాలక, ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించకుండా మౌనంగా ఉండడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం మణిపూర్‌లో గిరిజనులు, మహిళలపై దాడులు జరుగుతున్నా పట్టించుకోకుండా అల్లర్లు ఆపే ప్రయత్నం చేయకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ నెల 25వ తేదీన బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. సీపీఎం నాయకులు దువ్వా శేషుబాబ్జీ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా కేఎస్ శ్రీనివాస్, కె.ప్రసాద్, ఎస్.సూరిబాబు, పి.వీరబాబు, రమణి, టి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

చీడిగ నుంచి ద్వారకా తిరుమలకు పాదయాత్ర



పాదయాత్రగా వెళుతున్న బృంద సభ్యులతో గ్రామస్తులు

కాకినాడ రూరల్: మండలంలోని చీడిగ గ్రామంలో దశావతార వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం విజయవంతంగా పూర్తవ్వడంతో మొక్కు తీర్చుకునేందుకు ఆలయ ప్రధాన అర్చకుడు సతీష్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల బృందం ఆదివారం ద్వారకా తిరుమల పాదయాత్రగా బయలుదేరారు. గ్రామస్తులు వారిని దగ్గరుండి పంపారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ ఆచార్యులు మాట్లాడుతూ చీడిగలో దశావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ అనంతరం మొక్కులు తీర్చుకునేందుకు ఐదు రోజులు పాటు పాదయాత్ర ప్రారంభించామన్నారు.

పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: జాతర ఉత్సవాల్లో భాగంగా మరిడమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టారు.

నాటకాలకు పటాటోపాలు

- రంగస్థల అలంకరణ సామగ్రికి పెరుగుతున్న గిరాకీ
- నగరంలో రెండు షాపుల్లో లభ్యమవుతున్న వైనం



కిరీటాలు రెడీ!



వివిధ వేషధారణలకు సిద్ధంగా కవచాలు

కాకినాడ కల్చరల్: గతంతో పోల్చితే కళారంగానికి ఇటీవల బాగా ఆదరణ పెరుగుతోంది. దీంతో ఈ రంగానికి సంబంధించిన వేషధారణ (మేకప్), రంగస్థల అలంకరణ (స్టేజ్) సంబంధించిన మెటీరియల్స్‌కు గిరాకీ బాగా పెరిగింది. నాటకానికి కథ ఎంత ముఖ్యమో నటుల వేషధారణ, రంగస్థల అలంకరణ అంతకంటే ఎక్కువ ముఖ్యం. ఇవే నాటకాన్ని రక్తి కట్టిస్తాయి. ఇటువంటి సామగ్రిని అందుబాటులో ఉంచే సంస్థలు స్థానిక మసీద్ సెంటర్‌లో ఒకటి, సూర్యనారాయణపురంలో మరొకటి ఉన్నాయి. కాకినాడ నగరం, రూరల్ పరిధిలోని ఎక్కడ ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినా ఈ సంస్థలే మెటీరియల్ సమకూర్చుతాయి. ఈ సంస్థలో పౌరాణిక నాటకాలకు సంబంధించి కిరీటాలు, గదలు, వివిధ రకాల విగ్గులు, తలపాగాలు, కత్తులు, బల్లాలు, బాణాలు, కవచాలు అందుబాటులో ఉన్నాయి. శ్రీకృష్ణదేవ రాయలు, దుర్యోధనుడు, కర్ణుడు, భీముడు, శ్రీకృష్ణుడు తదితరుల వేషధారణకు సంబంధించి దుస్తులు, గౌనులు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల విద్యాలయాలలో పండగలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ భారత దేశ సంస్కృతి పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో సంబంధిత సామగ్రికి గిరాకీ పెరుగుతోంది. కూచిపూడి, భరతనాట్యం, కథక్ తదితర నృత్యాల సామగ్రి అందుబాటులో ఉంచారు. సాంఘిక నాటకాలకు సంబంధించిన పాత్రల వేషధారణ సామగ్రి అందుబాటులో ఉంది. గాంధీ. నెహ్రూ, సుభాష్ చంద్రబోస్‌ల వంటి నేతల వేషధారణ సామగ్రి లభిస్తోంది. క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవ యువతీయువకుల అలంకరణకు సామగ్రి, శిలువ మెటీరియల్ అందుబాటులో ఉన్నాయి. రంగ స్థల అలంకరణ సంబంధించిన కర్టెన్స్, టేబుల్స్, రాజులు కుర్చునే సింహాసనాలు వంటివి అందుబాటులో ఉంచారు. గ్రామీణ వాతావరణం ప్రతిబింబించే రోళ్ళు ,రోకళ్ళు, ట్రంకు పెట్టెలు కూడా సమకూర్చుతున్నారు.

కళారంగాన్ని ప్రోత్సహించాలి



40 సంవత్సరాల నుంచి మా సంస్థను నడుపుతున్నాం. గతంలో చాలా ఇబ్బందులు పడ్డాం. అయినా కళాకారులను నమ్ముకొని సంస్థ నడుపుతున్నాం. ఇటీవల పాఠశాలలు, కళావేదికలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించడంతో మా పరిస్థితి మెరుగ్గా ఉంది. నేను మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తున్నా. మన దేశ సంస్కృతికి చిహ్నాలయిన కళారంగాన్ని అందరూ ప్రోత్సహించాలి.

– డి.ఉమామహేశ్వరావు,

చికిత్స పొందుతూ మహిళ మృతి



మంగతాయారు (ఫైల్)

కరప: కాలిన గాయాలతో కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక మహిళ మృతిచెందారు. కరప పోలీసులు తెలిపిన కథనం మేరకు... కరప గ్రామానికి చెందిన చోడపునీడి మంగతాయారు(34) పీఏసీఎస్‌లో ఇన్‌చార్జి సీఈఓగా పనిచేస్తున్నారు.. ఈ నెల 21వ తేదీన డ్యూటీ ముగిసిన తర్వాత ఇంటికెళ్లి వంటచేస్తుండగా స్టవ్ రెగ్యులేటర్ నుంచి గ్యాస్‌లీకై మంటలు వ్యాప్తిచెందడంతో ఆమెకు తీవ్రగాయాలవగా కాకినా ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందారు. ఆమెకు భర్త, పిల్లలున్నారు. రైతులను చిరునవ్వుతో పలకరించి, పనులు చేసి పంపేవారని గ్రామరైతులు ఆమె సేవలను మననం చేసుకుంటున్నారు. ఆమె మృతికి పలువురు సంతాపం తెలిపారు.